శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నేడు సర్ఫాన్

శంషాబాద్ రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయం ఎంఆర్‌వో సైట్‌లో నేడు(బుధవారం) నూతనంగా ఏర్పాటు కానున్న సర్ఫాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీస్ సెంటర్‌ను వర్చువల్‌గా(వీడియో కాన్ఫరెన్స్) ప్రధానమంత్రి నరేంద్రమోడీ భూమిపూజ చేస్తారని జీఎంఆర్ అధికారులు మంగళవారం పేర్కొన్నారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఇద్దరూ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. ఉదయం 9.30గంటల నుంచి ఒంటిగంట కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.


వడ్డీలేని రుణాల చెక్కును అందజేస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే రంగారెడ్డి

మహిళల ఆర్థికవృద్ధే లక్ష్యం

ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ప్రజా ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను ఇస్తోందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇది చేతల ప్రభుత్వం అని, అభివృద్ధి విషయంలో మున్ముందు మరిన్ని మార్పులు చూడబోతున్నామని చెప్పారు. మంగళవారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ మహిళా సంఘాలకు శాస్త్రా గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి 3,508 స్వయం సహాయక సంఘాలకు రూ.4.43కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులను ఎంపీ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. వ్యాపార రంగాల్లోనూ రాణించేలా ప్రోత్సహిస్తోందని చెప్పారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను గాలికొదిలేసిందని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు ఇస్తోందన్నారు. మహిళా ఉత్పత్తుల విక్రయాలకు అమెజాన్ కంపెనీతో సంప్రదింపులు జరుపుతున్నామన్నామని తెలిపారు. ఫ్యూచర్ సిటీతో రాష్ట్ర రూపురేఖలే మారుతాయని అన్నారు. ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతూ.. రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, పేదలకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.అనంతరెడ్డి, తహసీల్దార్ అనితారెడ్డి, ఇబ్రహీంపట్నం, గడ్డిఅన్నారం ఏఎంసీ చైర్మన్లు కె.గురునాథ్‌రెడ్డి, చిలుక మధుసూదన్‌రెడ్డి, ఉప్పరిగూడ ప్యాక్స్ చైర్మన్ ఏదుల్ల పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ

ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీ ఆవరణలో రూ.37.5కోట్లతో నిర్మించే వంద పడకల ఆస్పత్రి భవనానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి భూమిపూజ చేశారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ నిధులతో చేపట్టే ఈ భవనంలో అధునాతన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రోగులకు అన్ని రకాల పరీక్షలు, శస్త్ర చికిత్సలు జరిగేలా హాస్పిటల్‌ను తీర్చి దిద్దుతామని చెప్పారు. కార్యక్రమంలో టీజీఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యుటివ్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, నాయకులు నీల్ల భానుబాబు, రాఘవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క పంచాయతీ దక్కలే..!

- ఆమనగల్లు మండలంలో బీసీలకు నిరాశ!
- ఆందోళనకు సిద్ధమవుతున్న బీసీ సంఘాల నేతలు

6



మొదటి విడత: కొత్తూరు, నందిగామ, కేశంపేట్, కొందుర్గు, చౌదరిగూడ, ఫరూఖ్‌నగర్, శంషాబాద్.
రెండో విడత: చేవెళ్ల, కందుకూరు రెవెన్యూ డివిజన్ల పరిధి శంకర్‌పల్లి, మొయినాబాద్, చేవెళ్ల, షాబాద్, ఆమన్‌గల్, కడ్తాల్, తలకొండపల్లి.
మూడో విడత: ఇబ్రహీంపట్నం, కందుకూరు రెవెన్యూ డివిజన్ల లోని అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల, మాడ్గుల, మహేశ్వరం, కందుకూరు.

విడతల వారీగా మండలాలు



సమరమే

మోగిన పంచాయతీ నగారా

- మూడు విడతల్లో ఎన్నికలు
- సర్వం సిద్ధం చేసిన యంత్రాంగం
- 526 పంచాయతీలు.. 4,668 వార్డులు
- అమల్లోకి ఎన్నికల కోడ్
- పల్లెల్లో రాజుకున్న రాజకీయ వేడి

గ్రామీణ ఓటర్ల వివరాలు	
మొత్తం ఓటర్లు	7,52,259
పురుషులు	3,76,873
ఇతరులు	28
మహిళలు	3,75,408

పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. దీంతో పంచాయతీల్లో రాజకీయ వేడి రాజుకుంది. జిల్లాలో మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. హైదరాబాద్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని మంగళవారం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. మొదటి విడతలో షాద్‌నగర్, రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్ల పరిధిలో, రెండో విడతలో చేవెళ్ల, కందుకూరు డివిజన్లలో పంచాయతీ ఎన్నికలు ఉండనున్నాయి. చివరి విడత ఇబ్రహీంపట్నం, కందుకూరు డివిజన్‌లో మిగిలిన పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ 25న అమల్లోకి వచ్చిన కోడ్ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అమల్లో ఉంటుంది. ఎన్నికల షెడ్యూల్ రాకతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం నెలకొంది.

విడతల వారీగా పోలింగ్ జరిగే పంచాయతీల వివరాలు

	తొలి విడత	రెండో విడత	మూడో విడత
నోటిఫికేషన్	నవంబరు 27	నవంబరు 30	డిసెంబరు 3
పోలింగ్	డిసెంబరు 11	డిసెంబరు 14	డిసెంబరు 17
రెవెన్యూ డివిజన్లు	షాద్‌నగర్, రాజేంద్రనగర్	చేవెళ్ల, కందుకూరు	ఇబ్రహీంపట్నం, కందుకూరు
మండలాలు	7	7	7
పంచాయతీలు	174	178	174
వార్డులు	1,530	1,540	1,598
పోలింగ్ కేంద్రాలు	1,530	1,540	1,612

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారు. మొదటి విడత పోలింగ్ డిసెంబరు 11న, రెండో విడత 14, మూడో విడత పోలింగ్ 17న జరగనుంది. ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహించి అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతారు. మంగళవారం పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని ప్రకటించారు.

మొదటి విడత ఈ నెల 27న రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి ఆ రోజు నుంచి 29వ తేదీ వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 30న నామినేషన్లు పరిశీలించి,

మిగతా 8వ పేజీలో...


ఔటర్ దాటిన.. గ్రేటర్

విలీనం కానున్న 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు

విస్తరణకు రాష్ట్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్.. స్థానిక రాజకీయ నాయకుల ఆశలు ఆవిరి

మేడ్చల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అంతా ఊహించినట్లుగానే జీహెచ్ఎంసీ విస్తరణలో భాగంగా నగర శివారు మున్సిపాలిటీలు జీహెచ్ఎంసీలో కలిపేందుకు ముందడుగు పడింది. ఔటర్ రింగు రోడ్డు లోపల, బయట, ఓఆర్ఆర్‌ను ఆనుకుని ఉన్న 27 మున్సిపాలిటీ, కార్పొరేషన్లు జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. జీహెచ్ఎంసీ పరిధి ప్రస్తుతం 650 చదరపు కిలోమీటర్లు ఉండగా.. ఔటర్ పరిధితో పాటు అవతల గల మేడ్చల్, ఘట్‌కేసార్ ప్రాంతాలకు జీహెచ్ఎంసీ విస్తరణతో 2వేల చదరపు కిలోమీటర్లకు పైగా పెరగనుంది. దీంతో జీహెచ్ఎంసీ సేవలు మున్ముందు ఔటర్ అవతలి వరకు గల ప్రాంతాల వరకు అందనున్నాయి. 27 మున్సిపాలిటీల్లో అధికం ఆదాయం వచ్చే ప్రాంతాలుగా నార్సింగి, మణికొండ, తెల్లాపూర్, అమీన్‌పూర్, బండ్లగూడ జాగీర్, నిజాంపేట, బడంగ్‌పేట తదితర ఉన్నాయి. రాష్ట్రంలో అత్యధికంగా నిర్మాణ అనుమతులిచ్చే కార్పొరేషన్లలో జీహెచ్ఎంసీ తర్వాత బడంగ్‌పేట ఔటర్ పరిధిలోని ఇతర కార్పొరేషన్లున్నాయి. ఇక ముందు జీహెచ్ఎంసీలో

మిగతా 7వ పేజీలో...



విలీనమయ్యే మున్సిపాలిటీలు

రంగారెడ్డి జిల్లా: పెద్దఅంబర్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, తుక్కుగూడ, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట..
మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా : మేడ్చల్, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, కొంపల్లి, దుండిగల్, బొల్లారం. **సంగారెడ్డి జిల్లా:** తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాల్టీలతో పాటు మేడ్చల్ జిల్లాలోని నాలుగు కార్పొరేషన్లు.. బోడుప్పల్, నిజాంపేట్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్‌లు సైతం జీహెచ్ఎంసీలో విలీనం కానున్నాయి.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కు అందజేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న వడ్డీలేని రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మహేశ్వరం ఏఎంసీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, డీఆర్డీవో శ్రీలత కోరారు. రుణాల చెక్కులను మంగళవారం మండల కేంద్రంలోని నవారు కిష్టమ్మ ఫంక్షన్ హాల్‌లో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కందుకూరు, మహేశ్వరం మండలాల డ్వాక్రా సంఘాల సభ్యులకు చెక్కులు అందజేశారు. 2,088సంఘాలకు రూ.2.42కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ యాదయ్య, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, మహేశ్వరం ప్యాక్స్ చైర్మన్ పాండుయాదవ్, వైస్‌చైర్మన్ డి.వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవోలు సరిత, శైలజ, ఏపీవో జి.గీత, ఏపీఎంలు, డీపీఎం, ఐకేపీ సీసీలు పాల్గొన్నారు.


ఉపాధి పనులపై కుర్మిద్దలో సమావేశం నిర్వహించిన అధికారులు(ఫైల్)

రూ.9కోట్లతో ఉపాధి

ప్రతి కూలీకి పనిచ్చేందుకు ప్రణాళిక ..గ్రామ సభలతో పనుల గుర్తింపు

యాచారం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఏడాది ఉపాధి హామీ కూలీలకు చేతినిండా పనికల్పించేందుకు అధికారులు పక్కా ప్రణాళికలు రచిస్తున్నారు. వచ్చే జనవరి నుంచి కూలీలకు పనికల్పించేలా ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు కొన్ని రోజులుగా మండలంలోని 24 పంచాయతీలు, 20 హామ్లెట్ గ్రామాల కూలీలు, రైతులతో సమావేశాలేర్పాటు చేసి పనులపై చర్చిస్తూ గుర్తిస్తున్నారు. మండలంలో 8,806 జాబ్ కార్డులుండగా వాటిల్లో యాక్టివ్ కూలీలు 14,318 మంది ఉన్నారు. ఈ ఏడాది కనీసం 1.05లక్షల పనిదినాలు కల్పించి, రూ.9కోట్లకుపైబడి నిధులతో పనులు చేయించేలా అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ఒక్క కూలీకి రోజుకు రూ.307 చొప్పున కూలి చెల్లిస్తోంది. ఏడాదిలో ప్రతి కూలీకి కనీసం వంద రోజులు పనికల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దివ్యాంగులకు కూడా వంద రోజులు పని కల్పించేలా చూస్తున్నారు. కూలీలతో ఫాం పాండ్స్, ఇంకుడు గుంతలు, సరిహద్దు కందకాలు, వరద కాలువల నిర్మాణం, కుంటల్లో పూడికతీత,

మిగతా 8వ పేజీలో...



పొలాల్లో ఇంకుడు గుంతలు నిర్మించాలి

పొలాల్లో వరద నీరు వృధాగా పోయే ప్రాంతాల్లో ఉపాధి హామీ కింద ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలి. ఫాం పాండ్స్, వరద పారే చోట్ల నేల కోతకు గురవకుండా రాతికట్టడాలకు అధికారులు చర్యలు తీసుకోవాలి. పొలాల్లో గుంతలను పూడ్చేయించడం, మట్టి దిబ్బలు ఎత్తించడం వంటి పనులు చేయించాలి.

- రాములు, రైతు, చౌదర్‌పల్లి

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

ఆమనగల్లు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ఆమనగల్లు ఏడీఏ శోభారాణి అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో పత్తి, ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. ఆకుతోటపల్లిలోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఏవో శ్రీనివాస్‌గౌడ్, సీసీఐ అధికారి రాజీవ్, మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ రాజేశ్వరితో కలిసి ఆమె సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. పూర్తిస్థాయిలో కొనుగోళ్లు చేయాలని, రైతులను మోసగిస్తే చర్యలు తప్పవన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ శోభారాణి




పొగమంచు.. భూమిని కప్పేస్తూ..

ఇబ్బందులు పడిన వాహనదారులు.. చలితో పొద్దెక్కే వరకు ఇళ్లకే జనం పరిమితం

షాబాద్ మండలాన్ని పొగమంచు కమ్మేసింది. మంగళవారం ఉదయం 8గంటల వరకు ముంబై-బెంగళూరు జాతీయ రహదారిపై దట్టమైన పొగ మంచుతో వాహనదారులకు రోడ్డు సరిగా కన్పించక లైట్లు వేసుకొని నడిపారు. ఎదుటి వాహనాలు సమీపంలోకొచ్చే వరకు కన్పించక డ్రైవర్లు 20 నుంచి 30కేఎంపీహెచ్ స్పీడ్‌లోనే వెళ్లారు. ఇదిలా ఉంటే తీవ్ర మంచు, చలితో వృద్ధులు, చిన్నారులు బయటకు వెళ్లలేక పొద్దెక్కేవరకు ఇళ్లకే పరిమితమయ్యారు. చేవెళ్ల పట్టణం, గ్రామాల్లో ఉదయం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు పొగమంచు కప్పేసింది. చలిగాలితో ప్రజలు ఇబ్బంది పడ్డారు. రోడ్డు కన్పించక వాహనదాలు లైట్లు వేసుకుని నడిపారు.



- షాబాద్/చేవెళ్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి)


సమావేశంలో మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

కాంగ్రెస్ పాలనలో కుంటుపడిన అభివృద్ధి

» బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జనం ఎంతో ఆశించి కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే ఆ పార్టీ నాయకులు ప్రజలను ఆశలను వమ్ము చేశారని, బీఆర్ఎస్ పాలనలో చేసిన పనులకు ప్రారంభోత్సవాలు చేస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. మంగళవారం యాచారంలో కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. నగరంలో సీఎం రూ.15వేల కోట్ల భూ కుంభకోణానికి పాల్పడ్డారని, ఆయన సోదరులు కూడా ప్రభుత్వ భూములపై కన్నేశారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఇద్దరూ గుంపు మేస్త్రీలుగా తయారయ్యారన్నారు. ఫ్యాక్స్‌కాన్ రెండో యూనిట్ బెంగళూరుకు తరలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కె.రమేష్‌గౌడ్, పి.భాషా, టి.రాజేందర్‌రెడ్డి, వి.రాజునాయక్, పరీక్షన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.


కళ్యాణ్‌రెడ్డి (ఫైల్)

ప్రేమ విఫలం.. టెకీ ఆత్మహత్య

ఘట్‌కేసర్‌రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమైందని మనస్తాపంతో ఐటీ ఉద్యోగి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, గుంటూరు జిల్లా, నంగడిగుంటకు చెందిన కుర్ర శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు కుర్ర పవన్ కళ్యాణ్‌రెడ్డి (26)సింగపూర్ టౌన్‌షిప్‌లో స్నేహితులతో కలిసి అద్దెకుంటూ ఇన్ఫోసిస్‌లో ఐటీ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల పవన్ కళ్యాణ్‌రెడ్డి ప్రేమవిఫలం కావడంతోమనస్తాపానికి గురై సోమవారం రాత్రి గదిలో బెడ్‌షీట్‌తో ఉరివేసుకున్నాడు. గమనించిన స్నేహితులు మృతుడి కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. మంగళవారం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. తన కుమారుడి మృతికి ప్రేమవిఫలమే కారణమని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి

● ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇతోధికంగా నిధులిస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. మంగళవారం యాచారం, నందివనపర్తి, కొత్తపల్లి, మంతన్‌గౌరెల్లి గ్రామాల్లో రూ.7.7కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో సర్పంచ్ పదవులను ఏకగ్రీవం చేసుకున్న గ్రామానికి అభివృద్ధికి రూ.కోటి ఇప్పిస్తానని వెల్లడించారు. ప్రతి గ్రామంలో యూజీడీ, సీసీ రోడ్లు, స్ట్రీట్‌లైట్లు వేయిస్తామని, పాఠశాలలకు అదనపు తరగతి గదుల నిర్మాణం చేపడుతామని చెప్పారు. ఫ్యూచర్ సిటీ ఏర్పాటుతో యువతకు ఉపాధి కల్పించేలా సీఎం రేవంత్‌రెడ్డి శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వసంక్షేమ పథకాలను, చేస్తున్న అభివృద్ధిని ఓర్వని కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఇది పద్ధతి కాదన్నారు. త్వరలో మీర్‌ఖాన్‌పేట నుంచి యాచారం వరకు రోడ్డు విస్తరణ పనుల పూర్తికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమాల్లో మస్కు నర్సింహ, ఏఎంసీ చైర్మన్ కె.గురునాథ్‌రెడ్డి, అక్బర్, కె.శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క పంచాయతీ దక్కలే..!

● ఆమనగల్లు మండలంలో బీసీలకు నిరాశే
● ఆందోళనకు సిద్ధమవుతున్న బీసీ సంఘాల నేతలు


ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయం

ఆమనగల్లు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మండలంలో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లు బీసీలకు తీవ్ర నిరాశ కలిగించాయి. 13 గ్రామ పంచాయతీలకు గాను ఒక్క పంచాయతీ కూడా బీసీలకు కేటాయించలేదు. దాంతో బీసీ సంఘాల నేతలు, సామాజిక వర్గాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్దఎత్తున ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆమనగల్లు మడంలంలో 13 గ్రామ పంచాయతీలకుగాను 6 జనరల్, 4 ఎస్టీలకు, 3 ఎస్సీలకు, అందులో ఆరు మహిళలకు కేటాయించారు. గ్రామ పంచాయతీల వారీగా ఆకుతోటపల్లి జనరల్, చెన్నంపల్లి జనరల్ మహిళ, చింతలపల్లి ఎస్సీ జనరల్, కోనాపూర్ ఎస్టీ మహిళ, కొత్తకుంట తండా జనరల్, మంగళపల్లి ఎస్టీ మహిళ, మేడిగడ్డ జనరల్ మహిళ, పోలెపల్లి ఎస్సీ జనరల్, రామ్‌నుంతల ఎస్టీ జనరల్, సీతారాంనగర్ తండా జనరల్ మహిళ, సంగంపల్లి జనరల్ మహిళ, శెట్టిపల్లి ఎస్సీ మహిళ, శంకర్‌కొండ తండా ఎస్టీ జనరల్‌గా కేటాయించారు. బీసీలు అధికంగా ఉన్న మండలంలో ఒక్క స్థానం కూడా ఆ సామాజిక వర్గానికి కేటాయించలేదు. దాంతో తమకు అవకాశం లభిస్తుందని.. సర్పంచ్‌గా పోటీ చేయాలని భావించిన ఆశావహులకు నిరాశే మిగిలింది. ఏ ప్రాతిపదికన రిజర్వేషన్లు ఖరారు చేశారని బీసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 13 పంచాయతీలకు ఒక్క స్థానం కూడా కేటాయించకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని చెబుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్‌లు కల్పిస్తామని ప్రభుత్వం ఆశచూపి తీరా మోసం చేసిందని బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. రిజర్వేషన్ల మూలంగా పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం లేకుండా పోయిందని బీసీ నాయకులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

ఒకే కుటుంబంలో మూడు పదవులు?

● మంతన్‌గౌడ్‌లో ఒకే ఒక్కఎస్టీ కుటుంబం
● సర్పంచ్, రెండు వార్డు సభ్యుల పదవులు దక్కే అవకాశం



బషీరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. ఈ నేపథ్యంలో ఆగ్రామ పంచాయతీలో ఒకే కుటుంబానికి సర్పంచ్, రెండు వార్డు సభ్యుల పదువులు వరించనున్నట్లు తెలుస్తోంది. ఈ పంచాయతీ ఎస్టీ జనరల్‌కు రిజర్వు కాగా, ఆ సామాజిక వర్గానికి చెందిన ఒకే కుటుంబం ఒక్క కుటుంబం ఇక్కడ ఉంది. ఆ ఇంట్లోంచి సర్పంచ్, రెండు వార్డు సభ్యుల పదవులు ఏకగ్రీవం అయ్యే అవకాశం కనిపిస్తోంది. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం మంతన్‌గౌడ్ గ్రామపంచాయతీలో 8వార్డులు ఉండగా, 449మంది ఓటర్లు ఉన్నారు. ఈ క్రమంలో సర్పంచ్ పదవి ఎస్టీ జనరల్‌కు రిజర్వయింది. గ్రామంలో ఎస్టీ సామాజికవర్గం లేకపోగా, ఆ ఊరిలో ఒకే ఒక ఎరుకల కుటుంబం ఉంది. ఆ కుటుంబం ఎస్టీ కిందకు రాగా ఆరుగురు ఓటర్లు ఉన్నారు. అందులో తల్లిదండ్రులు ఎరుకల భీమప్ప, వెంకటమ్మలతో పాటు ఇద్దరు కుమారులు, ఇద్దరు కొడళ్లు వారి సంతానం ఉంది. ఈ పంచాయతీ ఎస్టీ జనరల్‌కు రిజర్వ్ కావడంతో ఎరుకల భీమప్ప కుటుంబంలోంచి మాత్రమే సర్పంచ్, రెండు వార్డు సభ్యుల పదవులకు పోటీపడాలి. లేదా ఆ కుటుంబం నుంచి సర్పంచ్, రెండు వార్డుల పదవులను ఏకగ్రీవం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఆ కుటుంబానికి సర్పంచ్, రెండు వార్డు సభ్యుల పదవులు కలిసి రావడంతో గ్రామపంచాయతీలో ఈవిషయం హాట్‌టాఫిక్‌గా మారింది. ఇదిలా ఉండగా మండలంలోని దామర్‌చెడ్, గంగ్వార్ గ్రామపంచాయతీల్లో ఎస్సీ కుటుంబాలు ఉన్నప్పటికీ ఒక్క ఎస్సీ వార్డుకు కూడా రిజర్వేషన్లు దక్కలేదు. దీంతో ఆయా గ్రామాల్లో వార్డుసభ్యుల పదవులు దక్కే అవకాశాలు లేకపోవడంతో ఎస్సీ కుటుంబాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


మాట్లాడుతున్న ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్

'ఉర్సు'ను శాంతియుతంగా జరుపుకోవాలి

కొత్తూర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జేపీ దర్గా ఉర్సు ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని శంషాబాద్ జోన్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులో గల హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గా ఆవరణలో ఇన్‌స్పెక్టర్ జి.నర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతి సమావేశానికి ఏసీపీ హాజరై మాట్లాడారు. వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించే జేపీ దర్గా ఉర్సు ఉత్సవాలను హిందూ, ముస్లింలు కలిసిమెలిసి నిర్వహించుకోవాలన్నారు. ఎస్ఐ గోపాలకృష్ణ, ఆగీర్ రవికుమార్ గుప్తా, రాజేష్‌నాయక్, రవికుమార్‌ముదిరాజ్, రవినాయక్, మహ్మద్‌జిలానీపాల్గొన్నారు.

ఘనంగా టీఎస్ఎస్‌వో ఆవిర్భావ వేడుకలు

శంషాబాద్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సోషల్ స్టూడెంట్ ఆర్గనైజేషన్(టీఎస్ఎస్‌వో) ఆవిర్భావ వేడుకలను మంగళవారం శంషాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీ శ్రీనివాస్, అధికార ప్రతినిధి రమేశ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఆర్గనైజేషన్ స్థాపించిన కొద్దికాలంలోనే 10 లక్షల మంది సభ్యత్వం పొందారని, విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో విద్యార్థుల పక్షాన పోరాడే సంఘం టీఎస్ఎస్‌వోనేనని అన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ రాష్ట్ర నాయకులు మహేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ ప్రశంసనీయం

కందుకూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల ప్రజలకు విస్తృతంగా సేవలందించడం ప్రశంసనీయమని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గడ్డం మహేంద్రకుమార్ రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కందుకూరు, ఆమనగల్లుతో పాటు హైదరాబాద్ బాలాజీనగర్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో లయన్ పీడీజీ జి.చెన్నకిషన్‌రెడ్డి తండ్రి వెంకటరాజిరెడ్డి స్మారక ఉచిత మెగా వైద్యశిబిరాన్ని మంగళవారం తిమ్మాపురంలో నిర్వహించారు. 679 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు చెన్నకిషన్‌రెడ్డి తెలిపారు. జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. లయన్స్ పీడీజీలు ఎ.నటరాజ్, ఎస్.నరేందర్‌రెడ్డి, ఎస్ రాధకృష్ణ, వైఎం ధర్, జిల్లా ఫస్ట్ గవర్నర్ సురేష్ జగ్గాని, డిస్ట్రిక్ట్ సెంకడ్ వైస్ గవర్నర్ డాక్టర్ అంజయ్య, లయన్స్ క్లబ్ ప్రతినిధులు వివిధ ఆస్పత్రుల వైద్యులు పాల్గొన్నారు.


గ్రామస్తులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

టెక్‌హాక్-4 జాతీయస్థాయి హ్యాకథాన్ పోస్టర్ ఆవిష్కరణ



అనురాగ్ యూనివర్సిటీలో టెక్‌హాక్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో మంగళవారం టెక్‌హాక్-4 జాతీయస్థాయి హ్యాకథాన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనురాగ్ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో టెక్‌హాక్-4 జాతీయ స్థాయి హ్యాకథాన్‌లో భాగస్వాములు కావాలని డీన్ విష్ణుమూర్తి కోరారు. హ్యాకథాన్ వల్ల విద్యార్థులకు సాంకేతిక, వృత్తి నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థుల అభ్యాసం, ఆవిష్కరణలు మెరుగుపడుతాయన్నారు. 36గంటల పాటు జరిగే టెక్‌హాక్-4 హ్యాకథాన్ డిసెంబరు 12, 13తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతీయస్థాయి కోడింగ్ మారథాన్ వాస్తవ ప్రపంచ సవాళ్లకు వినూత్న పరిష్కారాలు, నమూనాలు, అనువర్తనాలు అభివృద్ధి చేస్తాయని విష్ణుమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోఈ డీన్ విజయకుమార్, అధ్యాపకులు రవీందర్‌రెడ్డి, రాజశేఖర్, బలరామ్, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు తరానా సింగ్, అమిత మిశ్రా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఔటర్ దాటిన.. గ్రేటర్

(ఐదో పేజీ తరువాయి)



విలీనమవుతున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో నిర్మాణ అనుమతులకు జీహెచ్ఎంసీ అనుమతులు ఇవ్వాల్సి ఉంది.

రాజకీయ నాయకుల ఆశలు ఆవిరి

ఓఆర్ఆర్ సమీపంలోని రంగారెడ్డి, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని పలు మున్సిపాల్టీలు జీహెచ్ఎంసీలో విలీనం కానుండటంతో స్థానిక నేతలకు ఒక్కసారిగా రాజకీయ భ్రమలు తొలగిపోయాయి. 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వారీగా ఛైర్మన్లు, మేయర్‌గా పదవులు అనుభవించాలని భావించిన వారికి నిరాశ ఎదురయ్యింది. రాజకీయంగా వారి ఆశలు అడియాశలయ్యాయి. ఇప్పుడిప్పుడే మున్సిపాలిటీల పరిధిలో ఎదుగుతున్న నాయకులు ఆశలపై ప్రభుత్వ నిర్ణయంతో నీళ్లు చల్లినట్లయింది. ఓఆర్ఆర్ సమీప మున్సిపాల్టీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయొద్దని కొంతకాలంగా మాజీ ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్న విషయం తెలిసిందే. జీహెచ్ఎంసీలో విలీనమైతే ఎదురయ్యే సమస్యల గురించి వివరించినా ఫలితం లేకుండా పోయింది. కాగా, మేడ్చల్‌లో ఇటీవల కొత్తగా ఏర్పడిన మూడు మున్సిపాల్టీల పరిస్థితి మాత్రం ఎటూ తేలకుండా పోయింది. దీంతో అక్కడి ప్రజల్లో సందిగ్ధత నెలకొంది. జిల్లాలోని 33 గ్రామాలను కలిపి ఇటీవల కొత్తగా ఎల్లంపేట, అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాల్టీలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. శివారులోని మున్సిపాల్టీలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తే జిల్లాలో ఇక మిగిలేది ఈ మూడు బల్దియాలే.. మరి వీటిని మున్సిపాల్టీలుగానే కొనసాగిస్తారా? లేదా? అనే సందేహాలు ప్రజల్లో నెలకొన్నాయి. వీటిని కూడా జీహెచ్ఎంసీలో విలీనం చేస్తే జిల్లా పూర్తిగా గ్రేటర్ పరిధిలోకి వెళ్లిపోతుంది.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఇందిరమ్మ ఇంటి ప్లాట్ల కబ్జా!

» తహసీల్దార్‌ను ఆశ్రయించిన గ్రామస్తులు

శంషాబాద్ రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలంలోని తొండుపల్లిలో ఇందిరమ్మ కాలనీలోని ప్రభుత్వ ప్లాట్లను అక్రమంగా ఆక్రమించిన వారి నుంచి విడిపించాలని తహసీల్దార్‌కు గ్రామస్తులు మంగళవారం ఫిర్యాదు చేశారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధి 10వ వార్డు తొండుపల్లి గ్రామంలో ఇందిరమ్మ కాలనీలో 2009లో అప్పటి ప్రభుత్వం లేఅవుట్ చేసి లబ్ధిదారులకు ప్లాట్లను కేటాయించింది. అయితే, ఆ ప్లాట్లు కాకుండా మిగతా 24 ప్లాట్లు ప్రభుత్వ అధీనంలోనే ఉన్నాయి. ఇదే అదనుగా భావించిన కొంత మంది ప్రజాప్రతినిధులు.. వాటిని కబ్జా చేసి రాత్రికిరాత్రే అక్రమ నిర్మాణాలు చేపట్టారని గ్రామస్తులు ఆరోపించారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ సర్పంచ్ అంజయ్య, సుధాకర్, శ్రీనివాస్, జయసింహ, అశోక్, రాజు తదితరులు ఉన్నారు.



అంగడిచిట్టెంపల్లిలో మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ సుజాత బృందం

వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి

పూడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగ అభివృద్ధికి మండలంలోని అంగడిచిట్టెంపల్లి గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు వ్యవసాయ విశ్వవిద్యాలయం మొక్కజొన్న పరిశోధన విభాగం సంచాలకులు డాక్టర్ సుజాత అన్నారు. మండలంలోని అంగడిచిట్టెంపల్లి గ్రామాన్ని మంగళవారం పరిశోధన విభాగం డాక్టర్ సుజాత బృందం పర్యటించింది. ఈ సందర్భంగా డాక్టర్ సుజాత మాట్లాడుతూ.. వచ్చే మూడు సంవత్సరాలపాటు శాస్త్రవేత్తలు గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామంలోని పొలాల్లో మట్టినమూనా పరీక్షలు, యాంత్రీకరణ, సాంకేతికపరమైన మెళకువలతోపాటు ఆదాయం పెంచడమే తమ ముఖ్య ఉద్దేశమని అన్నారు. అనంతరం 12మంది రైతులకు మొక్కజొన్న విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ మల్లయ్య, డాక్టర్ శ్రావణి, మండల వ్యవసాయాధికారి తులసీరాం, విస్తీర్ణాధికారి ఎలియాస్, రైతులు రవి, చెన్నయ్య, జంగయ్య, నవాజ్‌రెడ్డి, విఠలయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

» 'నేటి స్త్రీ' పుస్తకావిష్కరణలో ఎమ్మెల్యే మల్లారెడ్డి



నేటి స్త్రీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నేడు మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణిస్తున్నారని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం పోచారం మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ బద్దం మమతా జగన్ మోహన్‌రెడ్డి రచించిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోచారం మున్సిపాలిటీ పాలకవర్గంలో ఎంతో చురుకుగా పనిచేసిన మమత పదవి అయిపోగానే ఖాళీగా ఉండకుండా పుస్తక రచన చేపట్టడం అందరికీ ఆదర్శనీయమన్నారు. అందులో నేడు వివిధ రంగాల్లో మహిళలు రాణిస్తున్న తీరు ఎదురవుతున్న సవాళ్ల వంటి అనేక అంశాలతో పుస్తక రచన చేపట్టడం ఎంతో గొప్పవిషయమన్నారు. ఈసందర్భంగా ఆయన రచయిత మమతను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో చామకూర కల్పన, సబిత, మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు కైవసం చేసుకోవాలి

మంచాల, నవంబర్ 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు కైవసం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి నాయకులకు పిలుపునిచ్చాడు. మంగళవారం మంచాలలో జరిగిన బీజేపీ మండల కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ వైఫల్యం చెందిందని విమర్శించారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడగడపకూ ప్రచారం చేయాలని సూచించారు. బీజేపీ మండలాధ్యక్షుడు నూకం రాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వింజమూరి వెంకటిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దన్నె బాషయ్య, మారమోని శ్రీశైలం, పాండాల జంగయ్య, చివిరాల పాండు, వెదిరె జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

వార్డుల వారీగా అనధికార కమిటీలు

సమస్యల పరిష్కారానికి చొరవ .. బల్దియా సిబ్బందికి మొదలైన టెన్షన్



సాయిపూర్‌లో జరిగిన కోర్ కమిటీ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు

తాండూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలో అధికార కాంగ్రెస్ పార్టీ కొత్త ప్రయత్నానికి తెరలేపింది. పట్టణంలో ఉన్న 36వార్డుల్లో వార్డుకు ఆరుగురి చొప్పున పార్టీ ముఖ్య నాయకులతో అనధికారిక కోర్ కమీటీలను ఏర్పాటు చేసింది. వారం రోజులుగా పార్టీలో ముఖ్య నాయకులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు వార్డుల వారీగా కమిటీలు వేసి మంగళవారం నాటికి కమిటీల ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా వార్డుకు ఒక్క అధికారిని నియమించిన విషయం తెలిసిందే. వార్డుకు ఒక అధికారితో పాటు శానిటేషన్ జవాను, లేబర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయావార్డుల్లో పనిచేస్తుంటారు. వారికి అనుసంధానంగా కోర్ కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రతీరోజు వార్డుల్లో వార్డు అధికారితో పాటు కోర్ కమిటీ సమస్యలను గుర్తించి వారానికి ఒకసారి పరిష్కరిస్తారు.

ప్రతీ వారం వార్డు అధికారులతో గ్రామ సభలు

సమస్యలను గుర్తించి వార్డు అధికారులు, కోర్ కమిటీలతో ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూప్‌లో సమస్యలను తెలియజేస్తారు. ఈ గ్రూప్‌లో స్థానిక ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ కమిషనర్ కూడా ఉంటారు. ముఖ్యంగా శానిటేషన్ సమస్య, తాగు నీరు, స్ట్రీట్‌లైట్స్, అంగన్ వాడీల పని తీరుపై దృష్టి సారిస్తారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించే విదంగా చర్యలు చేపట్టారు. వారం వారం వార్డు అధికారులతో కలిసి గ్రామ సభలు ఏర్పాటుచేస్తారు. ప్రజల నుంచి సమస్యలు విని వెంటనే పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తారు. వార్డు ప్రజలకు అందించాల్సిన సంక్షేమ పథకాలు అందుతున్నాయా ఇందిరమ్మ, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు అర్హులు ఎవరు? అనే విషయాన్ని కూడా గుర్తిస్తారు.

బల్దియా అధికారుల్లో టెన్షన్

గతంలో అధికారులే వార్డుల్లో సమస్యలు గుర్తించి పరిష్కరించే వారు. ఇప్పుడు వారిపై అనధికారికంగా కోర్‌కమిటీలను ఏర్పాటుచేసి అధికారాలు కట్టబెట్టడంతో బల్దియా అధికారుల్లో టెన్షన్ మొదలైంది. కోర్‌కమిటీల సమస్యలను గుర్తించి తమ దృష్టికి తీసుకురావడానికి చొరవ చూపాలని మున్సిపల్ కమిషనర్ వార్డు అధికారులకు, జవాన్లకు అప్రమత్తంగా చేశారు. ప్రతీనెల వార్డు అధికారులు, కోర్‌కమిటీలతో మున్సిపల్ కమిషనర్, ఎమ్మెల్యే సమీక్ష నిర్వహిస్తారు. సమస్య తీవ్రతరం ఉంటే అక్కడికి స్వయంగా కమిషనర్ లేదా సంబంధిత ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు వెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలి. వార్డుల వారీగా వార్డు అధికారి, జవాన్లు ఫోన్ నంబర్లతో బోర్డులను కూడా ఏర్పాటుచేసి ప్రజలు నేరుగా వారికి సమస్యలు చెప్పేందుకు అవకాశం కల్పిస్తున్నారు.

'రైతు నేస్తం'ను సద్వినియోగం చేసుకోవాలి

-జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం



పత్తి మిల్లులో రైతులతో మాట్లాడుతన్న రాజారత్నం

కొడంగల్ రూరల్, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి మంగళవారం రైతు వేదికల్లో నిర్వహించే 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి రాజారత్న సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రావులపల్లి రైతు వేదికలో రైతులతో కలిసి ఆయన రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. వరివిత్తనాల పంపిణీని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ ప్రారంభించగా ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అలాగే పత్తి పంటల కోతల అనంతరం అవశేషాల నిర్మూలనకు తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం నీటూర్ గేట్ దగ్గర ఉన్న విజయ పత్తి మిల్లును సందర్శించి రైతులతో మాట్లాడారు. స్లాట్ బుక్ చేసుకోకుండా మిల్లుకు వెళ్తే పత్తి కొనుగోలు చేయరని వివరించారు. కావున పత్తి వేసిన రైతులు ఫోన్ నంబర్ అప్‌డేషన్ కోసం వ్యవసాయ విస్తరణ అధికారుల దగ్గరకి వెళ్లి చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో కొడంగల్ సహాయ వ్యవసాయ సంచాలకులు శంకర్ రాథోడ్, ఏఎంసీ ఛైర్మన్ అంబయ్యా గౌడ్, ఎంఏఓ శ్రీలత, పీఏసీఎస్ ఛైర్మన్ వివకుమార్ గుప్తా, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమానికి ట్రెసా కృషి

» ట్రెసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్

» ట్రెసా జిల్లా అధ్యక్షుడిగా డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ ఎన్నిక



ట్రెసా జిల్లా కార్యవర్గం



విజయేందర్

వికారాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమానికి తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) కృషి చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.గౌతమ్ కుమారు అన్నారు. వికారాబాద్ కలెక్టరేట్‌లో మంగళవారం ట్రెస్మా జిల్లా సమావేశం నిర్వహించి 22మందితో కూడిన జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పరిగి డిప్యూటీ తహసీల్దార్ గడ్డమీది విజయేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజేందర్ మూడు పర్యాయాలుగా జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూ వికారాబాద్, ధారూర్ నాయబ్ తహసీల్దార్‌గా పనిచేశారు. నూతన జిల్లా కార్యదర్శిగా మునీరొద్దీన్‌తో సహా 22మందితో కూడిన కార్యవర్గాన్ని జిల్లా రెవెన్యూ ఉద్యోగులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ కుమార్ మాట్లాడుతూ.. రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమానికి బాధ్యతగా పనిచేయాలని సూచించారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ట్రెసా పనిచేస్తోందని తెలిపారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్తూ పరిష్కారానికి ట్రెసా కృషి చేస్తోందని తెలిపారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర సమన్వయకర్త ఎం.నారాయణరెడ్డి, ఎన్నికల పరిశీలకులుగా కె.నిరంజన్‌రావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ట్రెసా కార్యదర్శి మనోహర్ చక్రవర్తి, మాజీ అధ్యక్షుడు పి.కృష్ణయ్య, స్థానిక తహసీల్దార్ లక్ష్మీనారాయణ, జిల్లా తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్

పంచాయతీ ఎన్నికల్లో 'కాంగ్రెస్' అభ్యర్థులకు పట్టం కట్టాలి

కడ్తాల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలందరూ కాంగ్రెస్ మద్దతు అభ్యర్థులకు పట్టం కట్టి ప్రగతికి బాటలు వేయాలని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాజకీయ ఉనికి కోసం విపక్షాలు సాగిస్తున్న కుట్ర రాజకీయాలను నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు విజయ సోపానమన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పనకు ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే ఆమోదించకుండా బీజేపీ ప్రభుత్వం మోకాలు ఒడ్డిందని ఆరోపించారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, జగన్ తదితరులు ఉన్నారు.



పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి పోలీసులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ

నేరాల నియంత్రణపై దృష్టిపెట్టండి

» కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి

» తాండూరు డీఎస్పీ నర్సింగ్‌యాదయ్య

పెద్దేముల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణపై ప్రత్యేకదృష్టి పెట్టాలని తాండూరు డీఎస్పీ నర్సింగ్‌యాదయ్య అన్నారు. రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డితో కలిసి పెద్దేముల్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీఎస్పీ పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌లోని పలు విభాగాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీచేశారు. అనంతరం స్టేషన్‌సిబ్బందితో సమావేశమై పెండింగ్ కేసులు ఉంటే వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. నేరాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. సైబర్‌నేరాలకు ప్రజలు గురికాకుండా వారికి తగిన అవగాహన కల్పించాలని చెప్పారు. రాత్రివేళ పహారా, మహిళాభద్రత, యువతలో నేరాల నియంత్రణ, సైబర్ భద్రతపై దృష్టిపెట్టాలని చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్‌సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డీఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఎస్ఐ శంకర్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలి



పరిగిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్‌ఏలు

పరిగి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏలకు వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. వీఆర్‌ఏల అక్రమ అరెస్టులను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం పరిగిలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 61 ఏళ్ల పైబడిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. వీఆర్‌ఏలు తలపెట్టిన చలో హైదరాబాద్ నిరసనను అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. గతంలో వారసత్వ ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు కల్పించాలని, లేనిచో ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏ జేఏసీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, కార్యదర్శి సంగమేశ్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి రవిసాగర్, రంగారెడ్డి జిల్లా భరత్‌యాదవ్, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు రమేశ్, పెద్ద జిల్లా అధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



కడ్తాల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిచెడ్ జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ట్రస్టు ఛైర్మన్, మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ ఛైర్మన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.

అక్రమంగా షెడ్డు నిర్మాణం .. కూల్చివేత



షెడ్డును కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు

ఘట్‌కేసర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని చౌదరిగూడ వెంకటాద్రి టౌన్‌షిప్‌లో అక్రమంగా నిర్మించిన షెడ్డును మంగళవారం హైడ్రా అధికారులు కూల్చివేశారు. చౌదరిగూడలోని సర్వేనెంబర్ 867లోని ప్రభుత్వ భూమిలో గతంలో అక్రమ లేఅవుట్ చేశారు. ఇళ్లమధ్యన, మెయిన్‌రోడ్డులో ఉండటంతో స్థానికులు ప్లాట్లు కొనుగోలు చేశారు. ఇక్కడ గజంస్థలం 50వేలకు పైగా ధర పలుకుతుంది. మొదట్లో అధికారులు ఇది ప్రభుత్వ స్థలమని అనుమతులు ఇవ్వలేదు. కాలక్రమేనా అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై అనుమతులు ఇవ్వడం ప్రారంభించారు. అనంతరం ఎల్ఆర్ఎస్ పథకం అందుబాటులోకి రావడంతో పలువురు తమ ప్లాట్లను ఎల్ఆర్ఎస్ అనుమతులు సైతం పొందారు. దీంతో పెద్దఎత్తున బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి. తాజాగా ఈశ్వర్ అనే వ్యక్తి మెయిన్‌రోడ్డుకు 800 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేశాడు. ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు షెడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో కాలనీవాసులు ఇది ప్రభుత్వస్థలమని హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగి షెడ్డును కూల్చివేశారు.



తన పత్రాలను చూపుతున్న బాధితుడు ఈశ్వర్

డాక్యుమెంట్, ఎల్ఆర్ఎస్, ఇంటి నంబరు ఉన్నాయి

నేను ఈస్థలంను మాజీ ఎమ్మెల్యే రెగా కాంతారావు వద్ద కొనుగోలు చేశాను. అప్పటికే ఇక్కడఇల్లు ఉండటంతో పాటు దానికి ఇంటి నంబర్, గ్రామపంచాయితీ ట్యాక్సు సైతం చెల్లిస్తున్నట్లు వివరించారు. నాకు స్థలాన్ని ఇప్పించిన వారే ఇది ప్రభుత్వ స్థలమని ఫిర్యాదు చేశారు. ఇదే లేఅవుట్‌లో నాలుగైదు అంతస్తులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్లు నిర్మించుకున్నారు. నావద్దకు వచ్చేసరికి ఇది ప్రభుత్వ స్థలమని కూల్చివేయడం సరికాదు. నావద్ద రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌తో పాటు ఎల్ఆర్ఎస్, ఇంటి నంబర్ ఉన్నాయి. ఇది ప్రభుత్వ స్థలమైతే అన్ని నిర్మాణాలను కూల్చివేయాలి.

- ముద్దం ఈశ్వర్, బాధితుడు

ఒత్తిడిని అధిగమించాలి

నందిగామ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మానసిక ఒత్తిడిని అధిగమించిన వారికి అన్నింట్లో విజయాలను సాధిస్తారని మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ అన్నారు. మంగళవారం నందిగామ చేగుర్‌లో శివశంకర్‌గౌడ్ సహకారంతో జిమ్స్ హోమియోపతిక్ మెడికల్ కళాశాల, ఆసుపత్రి ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్య అవగాహన సదస్సుతో పాటు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 80 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు నిర్వాహకులు చెప్పారు. జిమ్స్ కాలేజీ వైద్యులు, గ్రామస్తులున్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి

షాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సైన్స్‌పై ప్రతీ విద్యార్థి అవగాహన పెంచుకోవాలని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మంగళవారం షాబాద్‌లో బాలుర ఉన్నత పాఠశాలలో వివిధ పాఠశాలల విద్యార్థుల కొరకు వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్స్‌ఫేర్ నిర్వహించారు. మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ కవిత, ప్రధానోపాధ్యాయుడు బాల్‌రాజ్, వెల్‌స్పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ, ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

ఆదిభట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల అఖిల భారత స్థాయి ఉత్సవాల ముగింపు బహిరంగ సభ డిసెంబరు 26న ఖమ్మంలో నిర్వహిస్తున్నామని, ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి అన్నారు. మంగళవారం ఆదిభట్ల మున్సిపల్ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

తలకొండపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ఏఎంసీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అంజయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ అంబాజీలు వెల్జాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేసి ప్రొసీడింగ్స్ అందించారు. అశోక్‌గుప్త, ఆరిఫ్, కృష్ణగౌడ్, తదితరులున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యేలు శంకర్, కసిరెడ్డి, ప్రకాశ్‌గౌడ్, యాదయ్య
- మహిళా సంఘాలకు రుణాల పంపిణీ


షాద్‌నగర్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధి, సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, అందుకోసమే వడ్డీలేని రుణాలు అందజేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో 3,215 స్వయం సహాయక సంఘాలకు రూ.3.48 కోట్ల వడ్డీలేని రుణాలను ఆయన పంపిణీ చేశారు. రుణాలు పొందిన లబ్ధిదారులు సకాలంలో చెల్లిస్తేనే మరొకరికి రుణం ఇవ్వడానికి ఆస్కారం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, ఆర్డీవో సరిత, మున్సిపల్ కమిషనర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : ఆడబిడ్డలు సంతోషంగా ఉంటేనే రాష్ట్ర ఆర్థిక పురోగాభివృద్ధి సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీలక్ష్మి గార్డెన్‌లో ఆమనగల్లు, కడ్తాల్, మాడుగుల, తలకొండపల్లి మండలాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలను అందజేశారు. జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీపీఎం యాదయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ గీతా నర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డితో కలిసి 2,258 మహిళా సంఘాలకు రూ.2.35 కోట్ల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, తహసీల్దార్ ఫయ్యూమ్‌ఖాద్రి, తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లు : మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

శంషాబాద్ : తెలంగాణతో పాటు దేశాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. మున్సిపల్ కేంద్రంలోని బేగం ఫంక్షన్‌హాల్‌లో మండల పరిధిలోని 880 మహిళా సంఘాలకు రూ.కోటీ 6లక్షల రుణాలను ఎమ్మెల్యే అందజేశారు. మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. అంతకు ముందు ఎంపీడీవో మున్నీ మాట్లాడుతూ మహిళల అభివృద్ధి విషయంలో రాజీలేకుండా పనిచేయాలన్నారు. నార్సింగ్ మార్కెట్ కమిటీకి చెందిన శ్రీకాంత్‌గౌడ్ మల్లేష్, మల్కారం, శంషాబాద్ సింగిల్‌విండో చైర్మన్లు మల్లారెడ్డి ప్రభుసాగర్, శంషాబాద్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సుష్మా మహేందర్‌రెడ్డి తదితరులున్నారు.

చేవెళ్ల : మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో చేవెళ్ల డివిజన్‌లోని అన్ని మండలాల మహిళా సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలు రూ.3కోట్ల 69లక్షల 22వేల చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధుల కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాల్లోని మహిళా సంఘాలకు చెక్కులు అందజేశారు. తహసీల్దార్ బి.కృష్ణయ్య, ఎంపీడీవోలు హిమబిందు, వెంకయ్య, ఏపీఎంలు భీమయ్య, నర్సింలు, రవీందర్, పీఏసీఎస్ చైర్మన్‌లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్లు పెంటయ్యగౌడ్, సురేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ రాములు, మాజీ సర్పంచ్‌లు ప్రభాకర్, మధుసూదన్‌గుప్తా, శ్రీనివాస్, భీమయ్య, లావణ్యశంకర్, సీనియర్ నాయకులు జనార్దన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఆగిరెడ్డి, మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, తదితరులున్నారు.


శంషాబాద్ : చెకు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


చేవెళ్ల : చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, తదితరులు

తహసీల్దార్‌కు సన్మానం



కడ్తాల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జయశ్రీని మంగళవారం రాష్ట్ర గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు హనుమానాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆమెను శాలువా, పూలమాలలతో సన్మానించారు. రైతుల భూ సమస్యలను సత్వరంగా పరిష్కరించి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

నిబంధనలు పాటించాలి : ఆర్టీఏ సీఐ

మొయినాబాద్ రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రోడ్డు రవాణా శాఖ నిబంధనలు తప్పక పాటించాలని జిల్లా రోడ్డు రవాణా శాఖ సీఐ నవీన్ హెచ్చరించారు. మంగళవారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పోలీస్ స్టేషన్ ఎదుట ఆర్టీవో అధికారులు వాహనాలను తనిఖీ చేశారు.


బస్సులను తనిఖీ చేస్తున్న సీఐ నవీన్

భూదాన్ భూములకు పొజిషన్ చూపాలి

- కడ్తాల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా

కడ్తాల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కేటాయించిన భూదాన్ భూములకు పొజిషన్ చూపాలని కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ బాధితులు ఆందోళన బాటపట్టారు. ఈమేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కేటాయింపులు, ధ్రువపత్రాల ఆధారంగా భూములు చూపి సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని తహసీల్దార్ జయశ్రీకి వినతి పత్రం అందించారు. కడ్తాల్ మండల కేంద్రంలోని సర్వే నెం.260/9లో 2005-2006లో కడ్తాల్‌కు చెందిన దాదాపు 70 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ భూమిలేని నిరుపేదలకు భూదాన్ యజ్ఞ బోర్డు ద్వారా పట్టాలిచ్చారు. అయితే, 20 ఏళ్లయినా పట్టాలు ఇచ్చిన వారికి భూముల పొజిషన్ చూపలేదు. దాంతో పట్టాలు పొందిన రైతులు సాగు చేసుకుకోలేక జీవనోపాధికి ఇబ్బంది పడుతున్నారు. పొజిషన్ చూపాలని పలుమార్లు అధికారులతో కోరినా పట్టించుకోలేదు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి భూదాన్ భూముల సమస్యలను పరిష్కరిస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో న్యాయం చేయాలని బాధితులు కడ్తాల్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. లక్ష్మణ్, రాఘవ, యాదయ్య, అంజయ్య, సత్యనారాయణ, మాధవి, లక్ష్మమ్మ, జంగమ్మ, అంజమ్మ, ప్రశాంత్, నరేందర్ తదితరులు ఉన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే

షాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు అన్నారు. షాబాద్‌లో నిర్వహిస్తున్న రిలే నిరహార దీక్ష మంగళవారం 44వ రోజుకు చేరింది. షాబాద్ మండల పరిధిలోని బొబ్బిలిగామ గ్రామస్తులు దీక్షలో కూర్చున్నారు. బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు రవీందర్, రాజేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహులు, రాజు, జంగయ్య, విజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

చేవెళ్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలో నూతనంగా వేసిన సీసీ రోడ్లపై అవసరమున్నచోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని బీజేపీ చేవెళ్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎ.అనంతరెడ్డి, జిల్లా యువనాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి తెలిపారు. మంగవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులను కలిసి వినతిపత్రం అందించారు. నాయకులు శర్వలింగం, ఇంద్రాసేనారెడ్డి, అశోక్, విజయసింహారెడ్డి, శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులున్నారు.

ఎన్నికలు సజావుగా జరుపుకోవాలి

చౌదరిగూడ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలను సజావుగా జరుపుకోవాలని, ప్రజలంతా సహకరించాలని షాద్‌నగర్ రూరల్ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం తుమ్మలపల్లి, లచ్చం పేటలో గ్రామస్తులకు ఎన్నికల నేపథ్యంలో పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఎస్సై విజయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత


కడ్తాల్ : పూజలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

షాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం సంకేపల్లిగూడలో మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య వ్యవసాయ క్షేత్రంలోని గుడిలో నెలకొల్పిన ఎల్లమ్మ, మైసమ్మ దేవతామూర్తుల ఆలయ వార్షికోత్సవానికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి, గుడిమల్కాపూర్ ఏఎంసీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌లతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


షాబాద్ : పూజలో ఎమ్మెల్యే యాదయ్య, మధుసూదన్‌రెడ్డి

ఘనంగా 'హనుమాన్ ఇరుముడి'

కడ్తాల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైసిగండిలో మద్దిమడుగు జయరాం స్వామి ఆధ్వర్యంలో మంగళవారం హనుమాన్ ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ హాజరయ్యారు. కాగా, సమాజ శాంతి స్థాపనకు దైవ కార్యక్రమాలు దోహదపడతాయని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవనం పొందవచ్చునన్నారు. కడ్తాల్ మండలం మైసిగండి హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన అంజనేయస్వామి ఇరుముడి పూజకు శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇరుముడులు కట్టుకున్న మాలధారణ భక్తులు మద్దిమడుగు అంజనేయస్వామి ఆలయానికి తరలివెళ్లారు. ఏఎంసీ డైరెక్టర్ వీరయ్య, మాజీ ఎంపీటీసీ మంజులా చంద్రమౌళి, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, నాయకులు కృష్ణయ్య, శ్రీనివాస్‌రాజా, గోపాల్, కల్యాణ్, అయ్యప్ప స్వాములు, జవహర్‌లాల్ నాయక్, లచ్చిరాంనాయక్, హీరాసింగ్, తులసి రామ్‌నాయక్, ఆంజనేయ, అయ్యప్పస్వామి భక్తులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సమరమే

(ఐదో పేజీ తరువాయి)

అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. అభ్యంతరాలుంటే డిసెంబరు ఒకటో తేదీ సాయంత్రం 5గంటలలోగా తెలియజేస్తే 2న వాటిని పరిష్కరిస్తారు. 3న మధ్యాహ్నం 3గంటల్లోగా నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. సాయంత్రం బరిలో నిలిచే అభ్యర్థుల పేర్లను, కేటాయించిన గుర్తులను ప్రకటిస్తారు. 11వ తేదీ పోలింగ్ జరుగుతుంది.

రెండో విడత ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 30న విడుదల చేసి అదే రోజు నుంచి డిసెంబరు 2 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 3న నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల పేర్లు ప్రకటిస్తారు. అభ్యంతరాలను 4న సాయంత్రం వరకు స్వీకరిస్తారు. అభ్యంతరాలపై విచారణ జరిపి 5వ తేదీ పేర్లు ప్రకటిస్తారు. 6వ తేదీ మధ్యాహ్నం 3గంటల్లోగా నామినేషన్లు ఉప సంహరణ గడువు ఉంటుంది. అదే రోజు అభ్యర్థుల గుర్తులను ప్రకటిస్తారు. 14న ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్, మధ్యాహ్నం రెండు నుంచి ఓట్ల లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.

మూడో విడత ఎన్నికల నోటిఫికేషన్ డిసెంబరు 3వ తేదీ విడుదల చేస్తారు. అదేరోజు నుంచి 5వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 6న నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. అభ్యంతరాలుంటే 7వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా తెలియజేస్తే 8న సాయంత్రంలోగా పరిష్కరిస్తారు. 9వ తేదీ, మధ్యాహ్నం వరకు నామినేషన్లు ఉప సంహరణ గడువు ఉంటుంది. అదే రోజు అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తారు. 17వ తేదీ పోలింగ్ నిర్వహిస్తారు.

మూడు విడతల్లో ఎన్నికలు

మొదటి విడతలో షాద్‌నగర్, రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్ల పరిధి కొత్తూరు, నందిగామ, కేశంపేట్, కొందుర్గు, చౌదరిగూడ, ఫరూఖ్‌నగర్, శంషాబాద్(ఏడు) మండలాల్లో సర్పంచ్, వార్డు పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. కొత్తూరు మండలంలో 12 పంచాయతీల్లో, నందిగామలో 19 పంచాయతీల్లో, కేశంపేట్ మండలంలో 29 పంచాయతీల్లో సర్పంచ్, వార్డు పదవులకు ఎన్నికలు నిర్వహిస్తారు. కొందుర్గు మండలంలో 22 పంచాయతీల్లో, చౌదర్‌గూడ మండలంలో 24 పంచాయతీల్లో, ఫరూఖ్‌నగర్ మండలంలో 47 పంచాయతీల్లో, శంషాబాద్ మండలంలో 21 పంచాయతీల్లో ఎన్నికలు జరుగుతాయి.

రెండో విడతలో చేవెళ్ల, కందుకూరు రెవెన్యూ డివిజన్ల పరిధి శంకర్‌పల్లి, మొయినాబాద్, చేవెళ్ల, షాబాద్, ఆమన్‌గల్, కడ్తాల్, తలకొండపల్లి(ఏడు) మండలాల్లో సర్పంచులు, వార్డు పదవుల ఎన్నికలు నిర్వహిస్తారు. శంకర్‌పల్లి మండలంలో 24 పంచాయతీల్లో, మొయినాబాద్ మండలంలో 19 పంచాయతీల్లో, చేవెళ్ల మండలంలో 25 పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి. అలాగే షాబాద్ మండలంలో 41 పంచాయతీల్లో, ఆమన్‌గల్ మండలంలో 13 పంచాయతీల్లో, కడ్తాల్ మండలంలో 24 పంచాయతీలు, తలకొండపల్లి మండలంలో 32 పంచాయతీల్లో సర్పంచ్, వార్డు పదవులకు ఎన్నికలు నిర్వహిస్తారు.

చివరి విడతలో ఇబ్రహీంపట్నం, కందుకూరు రెవెన్యూ డివిజన్లలోని అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల్, మాడ్గుల్, మహేశ్వరం, కందుకూరు (రెండో విడతలో ఎన్నికలు జరగని గ్రామాల్లో) మండలాల్లో సర్పంచ్, వార్డు పదవుకు ఎన్నికలు జరగనున్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 14 పంచాయతీల్లో, ఇబ్రహీంపట్నం మండలంలో 14 పంచాయతీల్లో, యాచారం మండలం 24 పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. మంచాల మండలంలో 23, మాడ్గుల మండలంలో 34, కందుకూరు మండలంలో 35 పంచాయతీల్లో, మహేశ్వరం 30 పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు నిర్వహిస్తారు.

అమల్లోకి కోడ్

పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌తో జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. ఎన్నికలు పూర్తయ్యే అమల్లో ఉంటుంది. ఈ 25వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఉంటుంది. ఎన్నికల కోడ్ సమయంలో ప్రభుత్వం ఎలాంటి కొత్త పథకాలు ప్రకటించకూడదు. నేతలు ప్రభుత్వ వాహనాలు, అధికార యంత్రాంగం, వ్యక్తిగత లేదా ఇతర ప్రభుత్వ వనరులను వినియోగించకూడదు. గ్రాంట్లు, నిధులు చెల్లించకూడదు. కొత్త పనులు, నిధులు మంజూరు చేయకూడదు. కొత్త పథకాలు, ప్రాజెక్టులను ప్రకటించకూడదు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించకూడదు. ప్రభుత్వం ఓటర్లను ప్రభావితం చేసేలా హామీలు ఇవ్వకూడదు. నియామకాలు చేపట్టకూడదు. అదేవిధంగా రోడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యాల కల్పన వంటి హామీలు ఇవ్వకూడదు. ఎన్నికల ప్రచారంతో పాటు అధికారిక కార్యక్రమాలను కలిపి నిర్వహించకూడదు. శాంతి భద్రతల పర్యవేక్షించే అధికారులు తప్ప.. ఇతర ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ సమావేశాలకు హాజరు కాకూడదు. ఈ నిబంధనలు ఉల్లంఘించే వారిపై ప్రవర్తనా నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

ఆమనగల్లు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు జిల్లా వ్యాప్తంగా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి తెలిపారు. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించిన సామగ్రి మండలాలకు చేరుకుందని తెలిపారు. ఆమనగల్లు మండల పరిషత్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అభివృద్ధి పనులు, పథకాల అమలుపై ఎంపీడీవో మాధురితో సమావేశమయ్యారు. మండల పరిషత్‌లో భద్రపర్చిన ఎన్నికల స్టేషనరీని పరిశీలించారు. ఎన్నికల ఏర్పాట్లపై అడిగి తెలుసుకొని నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఏర్పాట్ల గురించి ఎంపీడీవో వివరించారు.


ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న సీఈవో కృష్ణారెడ్డి

శంషాబాద్ క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన శంషాబాద్ మండలంలో చోటుచేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి కథనం మేరకు.. శంషాబాద్ మండలం మదన్‌పల్లి పరిధిలో గల నూతన బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడని డయల్ 100కు స్థానికులు సమాచారం అందించారు. వెళ్లి పరిశీలించిన పోలీసులు వయస్సు 50-55 సంవత్సరాల మధ్య ఉంటుందని, మంగళవారం శంషాబాద్ నుంచి షాద్‌నగర్ వైపు వెళ్లే బ్రిడ్జి వద్ద కాలినడకన వెళ్తుండగా శంషాబాద్ నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా అక్కడికక్కడే మృతిచెందినట్లు గుర్తించారు. హెడ్ కానిస్టేబుల్ శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

అదుపుతప్పి లారీ బోల్తా

శంకర్‌పల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అతివేగం, అజాగ్రత్తతో డ్రైవ్ చేయడంతో లారీ అదుపు తప్పి రోడ్డుపక్కన బోల్తాపడిన ఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్వర్తి వద్ద మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చేవెళ్ల నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న లారీ అదుపు తప్పి శంకర్‌పల్లి మండలంలోని ఎల్వర్తి గ్రామం వద్ద బోల్తాపడింది. డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. లారీలో సరుకు ఉండడంతో భారీ నష్టం వాటిల్లింది. లారీ రోడ్డుపై అడ్డంగా పడటంతో ఆ మార్గంలో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

రూ.9 కోట్లతో 'ఉపాధి'

(ఐదో పేజీ తరువాయి)

కుంట కట్టల మరమ్మతు, బోర్‌వెల్స్ రీచార్జి, పండ్ల తోటల పెంపకం, నర్సరీల నిర్వహణ, రాతి కట్టడాలు, కోళ్లఫాం, డైరీ ఫారాల షెడ్లు నిర్మించడం తదితర పనులకు ప్రణాళిక రూపొందించారు. ఏపీవో, ఇంజినీరింగ్ కన్సల్టెంట్, టీఏలు గ్రామ సభలు ఏర్పాటు చేసి కూలీలకు, రైతులకు వివరిస్తున్నారు.

వ్యవసాయరంగానికి పెద్దపీట

ఉపాధి పనుల్లో పండ్ల తోటల సాగు, నర్సరీల పెంపకం పనులు ఎక్కువగా చేయించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతేడాది ఫాంపాండ్స్ నిర్మాణంలో జిల్లా మొదటిస్థానంలో నిలిచింది. ఈ సారి కూడా అలాంటి పనులే చేయించేందుకు చూస్తున్నారు. పొలంగట్ల వెంట, వృథాభూముల్లో పండ్లతోటలు పెంపకంపై రైతులను చైతన్యపరుస్తున్నారు. పనులు చేస్తున్న చోట కూలీలకు తాగునీటి వసతి, మెడికల్ కిట్లు, నీడ కోసం టెంట్లు, దూరప్రాంతాల నుంచి వచ్చేవారికి రవాణా వంటి వసతుల కల్పనలో అధికారులు నిమగ్నమయ్యారు.

కూలీలందరికీ వంద రోజులు పని కల్పిస్తాం



మండలంలోని ప్రతి కూలీకి వంద రోజుల పని కల్పించేలా ఏర్పాట్లు చేశాం. భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతల నిర్మాణం, వరద కట్టల నిర్మాణం, ఫాం పాండ్స్ పనులకు ప్రణాళికలు రూపొందించాం. పనులు చేసే చోట్ల కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తాం. వారవారం కూలీలకు వేతలిచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

- రాధారాణి, ఎంపీడీవో, యాచారం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాస్


నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాస్

మంచాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మంచాల మండల పరిధి ఆరుట్లకు చెందిన డాక్టర్ నాయినపల్లి శ్రీనివాస్ నియమితులయ్యాడు. ఈమేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి జాజుల శ్రీనివాస్ చేతులమీదుగా బీసీ భవన్‌లో నియామకపత్రం అందుకున్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ రిజర్వేషన్ల సాధనకు రాష్ట్ర వ్యాప్తం గా ఉన్న బీసీలను చైతన్యం చేయడానికి కృషి చేస్తానని తెలిపాడు. రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించడంపై బీసీ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. బీసీ సంక్షేమ సంఘం జేఏసీ నాయకులు గుజ్జ కృష్ణ, మాచర్ల రామకృష్ణ, కర్నాటి వెంకటేష్, మధు యాదవ్, కె.నవీన్, బండిరాజు, కర్రె శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

గృహ హింస, డిజిటల్ వేధింపులపై మహిళలకు అవగాహన

శంషాబాద్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ పట్టణంలోని భరోసా సీడీఈడబ్ల్యూ ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రం, జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం ఆర్జీఐఏ ఎస్సైలు హారిక, శ్రీనివాస్‌ల సహకారంతో అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినం సందర్భంగా గృహ హింస, డిజిటల్ వేధింపులపై మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం తెలంగాణ మహిళా భద్రతా విభాగం చర్యలపై డాక్యుమెంటరీ ద్వారా వివరించారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

మహేశ్వరం/కడ్తాల్/ఆమనగల్లు/తలకొండపల్లి/మాడ్గుల/ఆదిభట్ల/కొత్తూరు/షాద్‌నగర్‌రూరల్/కొందుర్గు/నందిగామ/కేశంపేట/చౌదరిగూడ/షాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మునుపెన్నడూ లేనివిధంగా అనేక రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యతనిస్తుందని జిల్లా పరిషత్ మాజీ జడ్పీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి అన్నారు. మంగళవారం మహేశ్వరం మండలం అమీర్‌పేట, నాగారంలో ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేశారు. మహిళల ఆత్మగౌరవం పెంపేలక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో చీరలు పంపిణీ చేశారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాలో మాజీ ఎంపీపీ అనితావిజయ్ నాయకులతో కలిసి చీరలు పంపిణీ చేశారు. తలకొండపల్లి మండలం గట్టుఇప్పలపల్లి, వెల్జాలలో కాంగ్రెస్ మండలాఅధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి పంపిణీ చేశారు. మాడ్గుల మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ యాదయ్యగౌడ్, నల్లచెర్వులో నాయకులు చీరలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొక్క సంజీవరెడ్డి, సౌడపు శేఖర్ గౌడ్, కుమ్మరి కృష్ణయ్యలు కందుకూరు మండలం కొత్తగూడ కార్యదర్శి శ్రీహరితో కలిసి గ్రామంలో పంపిణీ చేశారు. మండలంలోని 35 జీపీల్లో డ్వాక్రా మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్ ఆదిభట్ల మండల పరిధిలోని తులేకలాన్, కప్పపహాడ్, ఎలిమినేడులో చీరలు పంపిణీ చేశారు. కొత్తూర్ మండలం తీగాపూర్, మక్తగూడ, గూడూర్‌లో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి చీరలు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ షరీఫా బేగమ్ జహంగీర్ కొందుర్గు మండలం పులుసుమామిడి, టేకులపల్లి, కొందుర్గులో చీరలు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్లలో పంపిణీ చేశారు. నందిగామ మండలంలోని 19 జీపీల్లో చీరలు పంపిణీ చేశారు. కేశంపేట మాజీ జడ్పీటీసీ విశాలాశ్రవణ్‌రెడ్డి పాపిరెడ్డిగూడలో, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేశ్ చౌలపల్లిలో, కొండారెడ్డిపల్లిలో ఏఎంసీ డైరెక్టర్ కరుణాకర్, ఆనంద్‌కుమార్, కేశంపేటలో శ్రీధర్‌రెడ్డి, కొత్తపేటలో జగదీశ్వరప్ప, ఎక్లాస్‌ఖాన్‌పేటలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గిరిధర్, రావుల పెంటయ్యలు పంపిణీ చేశారు. తుమ్మలపల్లి మాజీ ఎంపీటీసీ రజిత, మండలాధ్యక్షుడు రాజులు జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని గ్రామాల్లో పింపిణీ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి షాబాద్ మండలం చందన్‌వెల్లి, రుద్రారంలో చీరలను పంపిణీ చేశారు.